
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 4 ఆగస్టు 2024



సింగరేణిలో పలువురు అధికారుల బదిలీలు 8లో..

తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి 7లో..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం



- నాలుగు దశల్లో పరిశీలన
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం లభించనున్నది. లేఅవుట్ అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండున్నరేళ్లుగా దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో అనుమతులు రాక ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై కోర్టులో ఉన్న కేసు కొట్టుడుపోవడంతో ఎల్ఆర్ఎస్‌కు మార్గం సుగమం అయ్యింది. ఇప్పటివరకు పెండింగులో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత మేరకు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాగా ఏర్పాటైన తర్వాత పెద్దపల్లి పట్టణంతో పాటు రూరల్ ఏరియాలో, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, తదితర ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి ప్లాట్లు చేసి విక్రయించారు. ఆ ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోవాలంటే తప్పనిసరిగా ఆ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తు రుసుం కింద వెయ్యి రూపాయలు వసూలు చేశారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 9,675 దరఖాస్తులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7,078 దరఖాస్తులు, సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో 1,531 దరఖాస్తులు, మంథని మున్సిపల్ పరిధిలో 894 దరఖాస్తులు, పెద్దపల్లి రూరల్ ఏరియాలో 6,334 దరఖాస్తులు, మొత్తం 25,512 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పెద్దపల్లి మున్సిపల్‌లో 2,838, రామగుండంలో 6,653, సుల్తానాబాద్‌లో 766, మంథనిలో 875, పెద్దపల్లి రూరల్ పరిధిలో 464 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. పెద్దపల్లి మున్సిపల్‌లో 108, రామగుండంలో 38, రూరల్ పరిధిలో 42 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన అనంతరం పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 56, రామగుండం పరిధిలో 37 దరఖాస్తుదారుల నుంచి 76 లక్షల 28 వేల 390 రూపాయలు ఎల్ఆర్ఎస్ వసూలు చేసి వారికి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. మిగతా దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న దశలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో పెండింగులో పడింది. అది కాస్త క్లియర్ కావడంతో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

● క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాకే..

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ కూడా ప్రభుత్వ భూమికి నష్టం కలగకుండా చూడాలని, నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. 4 దశల్లో ఎల్ఎఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. దరఖాస్తులను ముందుగా సిజిజి (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో ఫీల్టర్ చేసి, ధరణి ప్రొహిబిటెడ్ జాబితాలోని ఆస్తుల సర్వేనంబర్‌లతో చెక్ చేసి దరఖాస్తుదారులకు సమాచారం అందించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలనకు ఆర్ఐ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాలకు మొదటి దశలో సర్వే నంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీలలో దరఖాస్తులు చేరనున్నాయి. ఈ బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసి జీపీఎస్ ద్వారా సదరు భూమి కోఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేయనున్నారు. ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోనివి కావని ధ్రువీకరించాలని పేర్కొంది. ఈనెల మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాబోయే 3 నెలల వ్యవధిలో కలెక్టర్ల పర్యవేక్షణలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఎల్ఆర్ఎస్ రెండవ దశలో సదరు దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు, ఓపెన్ స్పేస్ మొదలగు నిబంధనలు లేఔట్‌లో పాటించారా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. వీటిని టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదించిన తర్వాత వెంటనే ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ఫీజు జనరేట్ అవుతుంది. ఆ ఫీజును దరఖాస్తుదారులు చెల్లించిన తర్వాత మూడో దశకు వెళ్తాయి. రెండవ దశ పూర్తి చేసిన దరఖాస్తులలో నుంచి ఒక శాతం దరఖాస్తులను యాదృచ్ఛికంగా డిప్యూటీ తహసీల్దార్‌కు పంపి క్రాస్ చెక్ చేయాలని, ఈ ప్రక్రియ పక్కాగా జరిగే విధంగా కలెక్టర్ పర్యవేక్షించాలని ప్రభుత్వం సూచించింది. మూడవ దశలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని గ్రామపంచాయతీలలోని దరఖాస్తులను సైతం అదనపు కలెక్టర్ ధ్రువీకరిస్తారని, అదనపు కలెక్టర్ ధ్రువీకరణతో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ జారీ కానున్నది. దీంతో ఆ ప్రక్రియ పూర్తి కానున్నది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన క్షేత్ర స్థాయిలో సజావుగా నిర్వహించేందుకు బృందాలకు అవసరమైన శిక్షణ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, కలెక్టరేట్, మున్సిపాలిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రెవెన్యూ మంత్రి సూచించారు. జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వివరించాలన్నారు.

ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై..
23 వరకు అభిప్రాయాలు సమర్పించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

పెద్దపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను ఈనెల23 వరకు సమర్పించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజలకు అందుబాటులో పెట్టిందన్నారు. నూతన చట్టం ముసాయిదా కింద సెక్షన్ 4 ప్రకారం కొత్త ఆర్వోర్ రికార్డు రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డుల సవరణకు అవకాశం ఉందని, గత చట్టం కింద నిలిచిపోయిన సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి సెక్షన్ 6 వెసులుబాటు కల్పించిందని, సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు అందుబాటులో ఉందని అన్నారు. ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు సలహాలు సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్‌సైట్, మెయిల్ ద్వారా ఈనెల23 వరకు తెలియజేయాలని ఆయన తెలిపారు. నూతన ఆర్వోఆర్ చట్టం అమలులోకి వచ్చేలోపు పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, మరో 3 వారాల వ్యవధిలో పూర్తిస్థాయిలో ధరణి దరఖాస్తులు పరిష్కారమయ్యే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు బి.గంగయ్య, వి.హనుమానాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా షీ టీమ్ సేవలు

- నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ

- హాట్ స్పాట్ ఏరియాల్లో మఫ్టీల్లో నిఘా : సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వ మహిళలు, విద్యార్థుల రక్షణకు ఏర్పాటు చేసిన షీ టీమ్ సమర్థవంతం సేవలందిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయన్నారు. షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్, కాలేజీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీ సేఫ్ అప్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తునట్లు సీపీ వివరించారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు బాలికలు, విద్యార్థినిలు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా విద్యార్థినులు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303824700కు కాల్‌చేసి లేదా వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు.

పలు తీర్మానాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున్

మంథని, ఆగస్టు 3: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా ఆగస్టు నెలలో శానిటేషన్ నిర్వహణకు ప్రైవేట్ లేబర్స్‌ను ఎంగేజ్ చేసుకోవడం, వీధి కుక్కల నివారణ, రేబీస్ వ్యాధి నుంచి రక్షణలో భాగంగా సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు, రేబీస్ వ్యాక్సిన్ చేపించుట, ఓపెన్ జిమ్ వద్ద పిల్లలు ఆడుకోవడానికి పార్కు ఏర్పాటు మొదలగు అంశాలను పాలకవర్గ సభ్యులతో చర్చించి ఆమోదం తీసుకోవడం జరిగింది. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛధనం-పచ్చదనం అవగాహన కార్యక్రమము వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్పీస్, ఆశ వర్కర్, అంగన్వాడి టీచర్స్ సమీక్షించారు. ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్‌శ్రీపతి బానయ్య, వార్డు కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి-పాపారావు, అరేపల్లి కుమార్, కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర -శంకర్, గర్రెపల్లి సత్యనారాయణ, కొట్టే పద్మ-రమేష్, చొప్పకట్ల హనుమంతరావు, వీకే. రవి, వేములక్ష్మి-సమ్మయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సమీక్ష సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 3 : మండలంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. శనివారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రారంభించిన స్వచ్ఛదనం-పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో ఆర్డీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛదనం, పచ్చదనం అనే కార్యక్రమాన్ని ఆగస్టు 5 నుంచి 9 వరకు ప్రతి గ్రామంలో పకడ్బందిగా నిర్వహించాలని ఆర్డీవో గంగయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కింద గ్రామాలలో పారిశుధ్య, తాగు నీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలని అన్నారు. మండలంలోని గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలని, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ద్వారా పూర్తి స్థాయిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాలకు, పట్టణాలకు వచ్చే దారుల వెంబడి ప్లాస్టిక్ చెత్త కనిపించవద్దన్నారు. గ్రామాలలో ఉన్న మల్టీ పర్పస్ వర్కర్లను వినియోగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యార్డు లను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛదనం-పచ్చదనంలో నిర్దేశించిన కార్యక్రమాలను అమలుచేయాలని, అవసరమైన చోట శ్రమదానం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో గుంతల రోడ్లను పూడ్చి వేయాలని, అవసరమైన రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లచే గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. దోమల నియంత్రణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలని, అదేవిధంగా మురికి కాలువలో, అధికంగా ఉన్న ప్రాంతాలలో దోమలు రాకుండా ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ గౌడ్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్ బాబు, సీడీపీవో కవిత, ఏపిఎంలు సంపత్, దివ్యలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుది దశకు టీయూఎఫ్ఐడీసీ టెండర్లు

- సీవోటీలో పరిశీలన పూర్తి.. త్వరలో వర్క్ ఆర్డర్లు

- రామగుండంలో నాలాల ఆధునికీకరణ, సీసీ రోడ్లకు మోక్షం

కోల్‌సిటీ, ఆగస్టు 3: రామగుండం నగరపాలక సంస్థలో అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. రూ.100కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పనులు చేపట్టనున్నారు. వరంగల్‌లోని ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం ఈ టెండర్లను నిర్వహించింది. కార్పొరేషన్ పరిధిలో నాలా ఆధునికీకరణ, సీసీరోడ్లు, సెంట్రల్ లైటింగ్, జంక్షన్ల డెవలప్‌మెంట్, ఫ్రూట్ మార్కెట్, స్లాటర్ హౌస్, మహిళా భవనాలు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం తదితర పనులు ఈ టెండర్‌లో పెట్టారు. గోదావరిఖని ప్రాంతంలో వ్యాపార కేంద్రం అభివృద్ధికి రూ.36కోట్లు కేటాయించారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజార్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.10కోట్లు, సీసీ రోడ్లకు రూ.12కోట్లు, వీధి దీపాలకు రూ.3.5కోట్లు కేటాయించారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యుత్ పోల్స్‌ను తొలగించేందుకు రూ.4కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి వివిధ ప్యాకేజీల్లో టెండర్లను ఆహ్వానించారు. అలాగే ఇందిరానగర్ నుంచి సప్తగిరికాలనీ వరకు, అడ్డగుంటపల్లి నుంచి 2ఏ మోరీ వరకు నాలా, మేడిపల్లి, పోరట్‌పల్లి నాలాల ఆధునికీకరణకు రూ.16.5కోట్లు ప్రతిపాదించారు. అలాగే 50డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20కోట్లు కేటాయించారు. మున్సిపల్ జంక్షన్ నుంచి ఫైవింక్లయిన్ వరకు, జీఎం ఆఫీస్ రోడ్డులో సెంట్రల్ మీడియన్ అభివృద్ధికి రూ.6కోట్లు కేటాయించారు. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్, జంక్షన్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.5కోట్లు కేటాయించారు. అలాగే రెండు మహిళా కమ్యూనిటీ హాల్స్‌కు రూ.2కోట్లు, గోదావరిఖని బస్టాండ్ సమీపంలో ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధికి రూ.4కోట్లు కేటాయించారు. రూ.3కోట్లతో స్లాటర్ హౌస్, ఎనిమల్ బర్త్ కంట్రోల్ హౌస్‌లు నిర్మించనున్నారు. రూ.2కోట్లతో జంక్షన్ల అభివృద్ధి, మరో రూ.2కోట్లతో గోదావరి ఒడ్డున శ్మశానవాటిక అభివృద్ధి చేయనున్నారు. కార్పొరేషన్‌లోని తాగునీటి పైప్‌లైన్లు లేని ప్రాంతంలో పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించారు.

సీవోటీలో క్లియరెన్స్

టీయూఎఫ్ఐడీసీ పనులకు సంబంధించి కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీఓటీ)లో క్లియరెన్స్ లభించింది. డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తికాగా ప్రైస్ బిడ్‌లలో నెగోసేషన్ ప్రక్రియకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. కాగా కూడళ్ల అభివృద్ధికి సంబంధించిన రూ.2కోట్ల పనులకు టెండర్లు దాఖలు కాలేదు మిగతా పనులకు టెండర్లు దాఖలయ్యాయి. ఫ్రూట్ మార్కెట్, స్లాటర్‌హౌస్‌కు సంబంధించి డీటీసీపీ నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానున్నాయి. టెండర్లు పూర్తయి న ప్రధాన పనులకు వారం రోజుల్లో వర్క్ ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంది.

ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

టీయూఎఫ్ఐడీసీ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్ల ప్రక్రియ పూర్తికాగానే వారం రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ఈ మేరకు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి దిశానిర్దేశం చేశారు. కార్పొరేషన్‌లోని ప్రతిపాదిత పనులపై అధికారులు పూర్తి సమాచారంతో ఉండాలని, ఎప్పటికప్పుడు పనుల పురోభివృద్ధిపై నివేదిక ఇవ్వాల్సిందిగా ఆయన ఆదేశించారు.

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు3: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ తాపాల లక్ష్మినరసింహ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి ఆధ్వర్యంలో జరుగగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి సుధాకర్ పాల్గొన్నారు. అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గల్ఫ్‌లో మల్లారెడ్డిపేట వాసి మృతి

● దుబాయ్‌లో పనిలేక ఆర్థిక ఇబ్బందులు
● స్వగ్రామానికి మృతదేహం

గంభీరావుపేట, ఆగస్టు 3: మండలంలోని మల్లారెడ్డిపేటకు చెందిన గెరిగంటి అంజయ్య(55) దుబాయిలో 45 రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. ఆరేళ్ల కిందట కూతురు పెళ్లి చేసిన అంజయ్య అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు అంజయ్య దుబాయి వెళ్లి ఓ కంపెనీలో పనికి కుదిరాడు. కొద్ది రోజులకే ఆ కంపెనీ మూసివేయడంతో రోడ్డున పడ్డాడు. అక్కడ పనిలేక, అప్పులు తీర్చే మార్గం లేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. చేద్దామంటే పనిలేక ఎవరూ పట్టించుకోకపోవడంతో దొరికిన నాడు తింటూ దొరకని నాడు పస్తులుంటూ వచ్చాడు. దీంతో సరిగ్గా ఆహారం లేక అనారోగ్యం పాలయ్యాడు. రోజురోజుకు గల్ఫ్‌లో అంజయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. చివరికి ఫుట్‌పాత్‌పైనే అంజయ్య తుదిశ్వాస విడిచాడు. పాస్‌పోర్ట్ కంపెనీ యాజమాన్య వద్దే ఉండిపోవడంతో మృతదేహం స్వదేశానికి తీసుకురావడానికి ఇబ్బంది ఏర్పడింది.

స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందిం చిన ఆయన ఇండియన్ ఎంబసీ లెటర్ పంపించడంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో శనివారం అంజయ్య మృతదేహం స్వగ్రామమైన మల్లారెడ్డిపేటకు చేరింది. అంజయ్య మృతదేహం ఇంటికి చేరగానే భార్య, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు ఉంది.



అంజయ్య (ఫైల్)






















వెల్దిలో జిలిటెన్ స్టిక్స్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 3: అక్రమంగా తరలిస్తున్న జిలిటెన్ స్టిక్స్‌ను వెల్ది గ్రామంలో పట్టుకున్నట్టు సీఐ సదన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరిటికల్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ అనే వ్యక్తి కొంతకాలంగా వీణవంక మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం వీణవంక నుంచి మండలంలోని వెల్ది గ్రామానికి 200 జిలిటెన్‌స్టిక్స్‌ను తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీలో పట్టుకుని విచారించగా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన వంగ సత్యనారాయణ, హుజురాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన జున్నోజు రాజేందర్ వద్ద వాటిని కొనుగోలు చేసినట్టు శ్రీనివాస్ తెలిపాడని తెలిపారు.ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, రామడుగు, బోయినపల్లి, ఆగస్టు 3: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 8,355 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌కు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు 8.5 టీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.125 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, మూలవాగు ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలకు ప్రస్తుతం 14.347 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం రాత్రి వరకు ఎస్సారెస్పీలోకి 17,925 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 43.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.352 టీఎంసీల నీరు వచ్చి చేరింది.



రామడుగు వద్ద నిండుగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌కు చెందిన నందగిరి రాజశేఖర్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల ఒ లాడ్జ్‌లో శుక్రవారం రాత్రి రాజశేఖర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన రాజశేఖర్ కుటుంబం ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. సిరిసిల్లలోని గీతానగర్‌లో నివాసం ఉన్న రాజశేఖర్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో గల ఓ కంపెనీలో రాజశేఖర్ ఎనిమిదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కొంత కాలంగా నెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న రాజశేఖర్ దాదాపు రూ.40లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రెండు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసిన రాజశేఖర్ అప్పులబాధ భరించలేక మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల కోసం మృతుడి అమ్మమ్మ స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామానికి తరలించారు.

ఖనిలో ఆంబోతుల వీరంగం

● టీవీ షోరూంలోకి దూసుకెళ్లిన ఎద్దులు



గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పోట్లాటకు దిగిన ఆంబోతులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 3: గోదావరిఖనిలో జనం రద్దీ ఉండే ప్రదేశంలోనే ఎద్దులు పోట్లాటకు దిగుతుండడంతో ఆమాయకుల బలి, చేతులు విరుగుతున్నాయి. శనివారం నిత్యం రద్దీగా ఉండే గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గంట పాటు ఆంబోతులు కొట్లాటకు దిగడంతో రెండు ఎలక్ట్రికల్ షాపులు, ఓ టీవీ షోరూమ్‌లో వస్తువులు, రోడ్డుపై ఉన్న పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలపై ఆంబోతులు దూసుకురావడంతో పరుగులు తీశారు. అక్కడ ఉన్న వారు వాటిని నెట్టివేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ అవి ఎంతకూ అక్కడి నుంచి వెళ్లిపోలేదు. ఓ టీవీషాపులోకి దూరి టీవీలను, ఫ్రిజ్‌లను ధ్వంసం చేశాయి. పశువుల బారి నుంచి కాపాడాలని ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట పశువులు కొట్లాటకు దిగుతుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి కాళ్లు చేతులు కూడా విరిగిపోయిన ఘటనలు గోదావరిఖనిలో ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవాలని ప్రజలు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

- అధికారులకు చిక్కిన తహసీల్దార్, డ్రైవర్, తాత్కాలిక ఉద్యోగి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. తహసీల్దార్ జాహెద్‌పాషాతో పాటు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషా, తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం చిన్నకొమిరె గ్రామానికి చెందిన కడెం తిరుపతికి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారు సర్వే నంబర్ 645లో 28గుంటల భూమి ఉంది. బ్యాంకు లోన్ కోసం పహణి నకల్ అవసరం కావడంతో రూ.10 వేలు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. ఈ విషయమై తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్, డ్రైవర్ అమ్జద్‌పాషా తిరుపతి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. దాసరి ధర్మేందర్‌తో పాటు తహసీల్దార్ జాహెద్‌పాషా, డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషాలను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. తిరుపతి తండ్రి పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు దాసరి ధర్మేందర్, అమ్జద్ పాషా ద్వారా రూ.50వేలు లంచం తీసుకున్న తహసీల్దార్ జాహెద్‌పాషా గత నెల 23న మ్యుటేషన్ చేశాడని తెలిపారు. ఇటీవల మ్యుటేషన్ కావడంతో బ్యాంకు లోన్ కోసం దాఖలుపెట్టు, పహణి నకలు మ్యాన్యువల్‌గా ఇవ్వాల్సి ఉన్నందున తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడన్నారు. దాసరి ధర్మేందర్, అమ్జద్‌పాషాల వాంగ్మూలం మేరకు తహసీల్దార్‌నుఅరెస్టు చేశామని తెలిపారు.



ఏసీబీకి చిక్కిన దాసరి ధర్మేందర్, తహసీల్దార్ జాహెద్‌పాషా, అమ్జద్‌పాషా

పాముకాటుతో ఒకరి మృతి

గన్నేరువరం, ఆగస్టు 3, మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన గోపుకొండ రాజేశం(68) శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పాముకాటుకు గురై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. మృతుడి కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం, ఆగస్టు 3: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన పోలవేని వీరయ్య(78) అనారోగ్యం కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధుడు గతంలో చెట్టుపై నుంచి పడి వెన్నుముకకు దెబ్బ తగలడంతో అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపానికి గురైన వీరయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

భర్త కాపురానికి తీసుకెళ్లాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రుచిత కుటుంబ సభ్యులు, బంధువులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 3: తనను కాపురానికి తీసుకెళ్లాలని మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో భర్త ఇంటి వద్ద భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రుచితకు కోరుట్ల మండల గుమ్లాపూర్‌కు చెందిన బోయిని రమణతో 2024, ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో రుచితను తన వద్ద వేంపేటలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. రుచిత తల్లిదండ్రులు పలుమార్లు కుల సంఘ పెద్దలతో పంచాయతీలు నిర్వహించి సముదాయించారు. దంపతులిద్దరినీ ఆసుపత్రిలో చూపించి వైద్యంతోనూ చెప్పించారు. చివరకు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో రమణను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రుచితను కాపురానికి తీసుకెళ్లడానికి ఒప్పించారు. రోజులు గడుస్తున్నా కాపురానికి తీసుకెళ్లకపోవడంతో శనివారం రుచితతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గుమ్లాపూర్‌కు తరలి వచ్చి అత్తింటి ఎదుట బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న రమణ అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోరుట్ల 2వ ఎస్ఐ అలీప్ ఖాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రుచిత బంధువులు ఆందోళన విరమించారు. కాగా పోలీస్‌స్టేషన్‌లో రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.







చిరుత దాడిలో రెండు ఆవులు మృతి

గంభీరావుపేట, ఆగస్టు 3 : గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీప అడవుల్లోని మెట్ట ఒడ్డె ప్రాంతంలో శుక్రవారం రాత్రి రెండు ఆవులపై చిరుత పులి దాడి చేసింది. గోరంటాలకు చెందిన చంద్రం అనే రైతుకు చెందిన రెండు ఆవులను తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం రాత్రి కొట్టంలో ఉన్న రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపేసింది. ఉదయం ఎప్పటిలాగానే రైతు తన పొలం వద్దఉన్న కొట్టం వద్దకు వచ్చి చూసే సరికి రెండు ఆవులు గాయాలతో చనిపోయి ఉన్నాయి. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌లు సంఘటన వద్దకు చేరుకుని పరిశీలించారు. చిరుత పులి దాడి వల్లే ఆవులు చనిపోయాయని ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

అడవిపల్లి దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి: మండలంలోని దేవుని తండాలో ఎర్ర చెరువు ప్రాంతంలో పశువుల పాకలో శుక్రవారం రాత్రి జంగిల్ క్యాట్ (జిత్తపులి) దాడిలో లేగ దూడ మృతి చెందింది. వట్టిమల్ల ఎఫ్ఎస్ఓ అన్వర్ హుస్సేన్ కథనం ప్రకారం.. సరిలాల్ అనే రైతు రోజు మాదిరిగానే లేగ దూడను పశువుల పాకలోకి తోలి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం పశువుల పాకకు వెళ్లి చూడగా లేగదూడ మృతి చెంది ఉన్నది. దూడ మృతి చెందిన విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది.. చిరుత పులి కాదని జంగల్ క్యాట్ (జిత్తపులి) దాడిలోనే దూడ మృతి చెందిందని తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఆగస్టు 3: ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 5న సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు. క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలు, పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో పురాతన శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఉంది. గోదావరి నదీ తీరాన గోదావరి మాత, సంతోషీమాత, పురాతన మహాలక్ష్మి, శివ సాయి బాబాజీ, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి చేరుకునే భక్తులు గోదావరిలో స్నానాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా నది పోలీసాతులచే సంకల్పాది పూజలు చేయించుకుంటారు. నవదంపతులు జల్లిపుడు అయిన చిన్న గణ్ణె కిష్టుడికి జలంతో అభిషేకం చేసి పూజిస్తారు. భక్తులు శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ రామ లింగేశ్వర, శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి వారలను దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో వచ్చే నాగుల పంచమి నాడు పాము పుట్టల్లో పాలు పోసి రాఖీ పౌర్ణమి రో జున యజ్ఞోపవీతధారణ జరిపి అనేక మంది భక్తులు శ్రీ సత్యనారా యణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు. నెల రోజుల పాటు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో పూజలు

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రధాన దేవాలయంలో స్వామి వారికి నెల రోజుల పాటు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. భక్తులు రూ.2,516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం, పూజలు, సంకల్పం నిర్వహిస్తారు. ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక భోగములు జరిపి రూ. 2,000 చెల్లిస్తే భక్తుల పేరట నెల రోజుల పాటు అభిషేకం, భోగములు, సంకల్పం నిర్వహిస్తారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రూ 516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం నిర్వహిస్తారు.

అమెరికా ఫెలోషిప్‌నకు వీణవంక విద్యార్థిని ఎంపిక



ఫెలోషిప్‌నకు ఎంపికైన పావని

వీణవంక,ఆగస్టు3:అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ విద్యలో ప్రతిభావంతులైన నలుగురు విద్యార్థులను ఫెలోషిప్‌కు నలుగురిని ఎంపిక చేశారు. అందులో వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావని ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మాస్టర్స్ చదువులకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తుందని,ప్రతి విద్యార్థికి 55.50 లక్షల చొప్పున నలుగురికి 2.22 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు. పావని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. 2025-26 సంవత్సరంలో అమెరికాలో అబ్రామ్ యూని వర్సిటీ అలబామాలో వారు మాస్టర్స్ పూర్తి చేస్తారని తెలిపారు. 2023-24, 2024-2025లో డిగ్రీ పూర్తి చేసిన బ్యాచ్ ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి

● వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలి ● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 3 : రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ కూలీలకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను చాడ వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోసం కృషి చేయాలని, అందులో భాగంగానే వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలని అన్నారు. ఆసరా పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజు పనిచేసే కూలీలకు రూ. 700 చెల్లించాలని, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులతో పాటు సమ్మర్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో చాలా సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇళ్లు మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించి ఉన్న ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూలీబంధు పథకం అమలు చేయాలని, ఎన్నికల గ్యారంటీలలో భాగంగా ఇళ్లు లేని పేదలకు గృహజ్యోతి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వడమే కాకుండా ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సాగు భూమి లేని వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను ఆక్రమణ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంతయ్య, నక్క బాలమల్లేష్, రాష్ట్ర నాయకులు కొయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, యేసు, లింగారెడ్డి, ఎగుర్ల మల్లేశం, గుంటి వేణు, కడారి రాములు తదితరులు ఉన్నారు.



వేములవాడ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

● రూ. 7 లక్షల నకిలీ కరెన్సీ, కారు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (మెట్‌పల్లి): తక్కువ మొత్తం అసలు కరెన్సీ ఇస్తే ఎక్కువ మొత్తంలో నకిలీ కరెన్సీ ఇస్తామంటూ ఎర వేసి తీరా అసలు కరెన్సీతో పారిపోయి జల్సాలకు అలవాటు పడ్డ ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్టు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలో డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారానికి చెందిన సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన కిషన్, మల్లయ్య, గంగారం, అశోక్ అనే ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 లక్షల నకిలీ కరెన్సీ, ఒక కారు, ద్విచక్ర వాహనం, 6 సెల్‌ఫోన్లు, 5,050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ముఠా సంవత్సరకాలంగా ఇద్దరు చొప్పున ఒక ముఠాగా ఏర్పడి హైద్రాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరి వద్ద నుంచి డబ్బులు కాజేశారు. లక్ష అసలు కరెన్సీ ఇస్తే రూ.4 లక్షలు నకిలీ నోట్లు ఇస్తామని వల వేశారు. ఇలా వల వేసి అక్కడకు వెళ్లిన తర్వాత నకిలీ వ్యక్తికి బ్యాగులో 4 లక్షల వరకు నకిలీ నోట్లను చూపి అతని వద్ద ఉన్న ఒరిజినల్ లక్ష తీసుకున్న తర్వాత పారిపోవడం మోసాలకు పాల్పడేవారని తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 10 లక్షల వరకు నిందితులు లాక్కొని పరారీలో ఉన్నట్టు తెలిపారు. పరారీలో ఉన్న ముఠా సభ్యులు ఈ నెల 1న పట్టణ శివారులోని పెద్ద గుండు వద్ద స్థానిక దాబా యాజమాని వద్ద నుంచి లక్ష లాక్కొని పరార య్యారు. యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజు గాలింపు చర్యలో భాగంగా శనివారం పట్టణంలోని వెంకట్రావుపేట దాబాల్లో గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డిని, ఎస్ఐ చిరంజీవిని, రాజు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు

పీఎం కిసాన్ జాబితా పేరిట లింకులు

● జోరుగా సైబర్ మెసేజీలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు3: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో రెండు రోజులుగా సైబర్ నేరగాళ్లు నుంచి వస్తున్న వాట్సప్ మెసేజ్‌లు చూసి కంగుతింటున్నారు. రెండు రోజుల క్రితం నగునూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పీఎం కిసాన్ లిస్ట్51 పేరుతో ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జాబితాలో తమ పేరు చూసుకోవడానికి అతడు మెసేజ్‌ను ఓపెన్ చేశాడు. అది ఓపెన్ కాక ఇన్‌స్టాల్ అడగటంతో దాన్ని ఇన్‌స్టాల్ చేశాడు. దీంతో వెంటనే ఫోన్ హ్యాక్ కు గురికావడంతో ఫోన్‌ నుంచి బాధితుడు తెలిపాడు. అయితే అతడికి ఫిషర్జర్ నుంచి బ్యాంకుల ఫోన్‌పే ఓటీపీ నంబర్ కావాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చిన అతను ఓటీపీ ఓపెన్ చేయలేదు. కానీ అతని ఫోన్ నెంబర్ నుంచి ఇతర వ్యక్తులకు, గ్రూపులకు అతని ప్రమేయం లేకుండానే మెసేజీలు పోవడం గమనించారు. విషయం తెలుసుకున్న ఆ గ్రూప్ అడ్మిన్ అతన్ని తొలగించినా గ్రూప్‌లో ఉన్న వ్యక్తులకు మెసేజీలు రావడం మొదలైంది. దాదాపు ఆగ్రూప్‌లో 250మంది ఉన్నారు. మొదటగా ఆ గ్రూప్‌లో ఆ మెసేజ్ పెట్టిన వ్యక్తి పేరిట కొంతమందికి ఇలా మెసేజ్‌లు వస్తున్నాయి. కొంత మంది ఓటీపీలు రావడం మరికొందరికి ఫోన్లు రావడంతో గ్రామంలో పలువురు ఆందోళన చెందుతున్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం అమలుపై సమీక్ష


గోదావరిఖనిలో మాట్లాడుతున్న సెక్రెటరీ రాజు


పెద్దపల్లిలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేష్

కోల్‌సిటీ, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంపై రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఐదు రోజుల కార్యాచరణను అమలు చేయనున్నట్టు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. 5వ తేదిన ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, వార్డు కమిటీల సహకారంతో స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 6న తాగునీటి వనరులు, వాననీటి సంరక్షణకు సంబంధించిన పనులు, 7న నీరు నిలిచిన గుంతను పూడ్చడం, మురుగు నీరు నిల్వఉండకుండా ఏర్పాటు చేయడం, 8న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహకారంతో జ్వరసర్వే, అంటు వ్యాధుల వ్యాప్తి నివారణ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది సహకారంతో వీధి కుక్కల సర్వే, మనుషులపై దాడి చేసే స్వభావం ఉన్న వాటిని గురించి స్టెరిలైజ్ చేయడం, జంతు జనన నియంత్రణ కేంద్ర నిర్వహణ తదితర కార్యక్రమాల నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఆగస్టు 9న డ్రైడే పాటిస్తూ నివాస గృహాలతోపాటు ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయడం, శిథిలావస్థకు చేరుకున్న భవనాలను, గోడలను తొలగించడం, వన మహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రాజు, సూపరింటెండెంట్ మనోహర్,ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని ఎంపీడీవో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జీ ఎంపీడీవో సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి, సెర్ప్ ఏపీఎం శైలాజా, శాతి, ఏపీవో లావణ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 3 : మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం మండల పంచాయతీ అధికారి కేవి.మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ జేడి.భాస్కర్, ఏపీఎం సుధాకర్, డాక్టర్ నిస్సిక్రిస్టోన, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివోఏ, అంగన్వాడీటీచర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో రామ్మోహనచారి మాట్లాడారు. అన్ని శాఖల ఉద్యోగులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, హెచ్ఈఓ లక్ష్మణ్, సీహెచ్‌వో సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్లు సరోజన, నీరజ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సావిత్రి, ఏపీఎం కనకయ్య, ఏపీవో మంజుల, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి, ఆగస్టు 3: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి శివయ్య అన్నారు. శనివారం పాలకుర్తి రైతు వేదికలో ఎంపీడీవో పొల్సాని శశికళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శివయ్య మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీవో సుదర్శన్, పూట్నూర్ పీఎస్ ప్రధాన వైద్యుడు సాయిసూర్య, గ్రామ ప్రత్యేక అధికారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, ఆగస్టు 3 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న పచ్చదనం-స్వచ్ఛదనంపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో తిరుపతి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, ఎంపీవో షబ్బీర్ పాషా, డాక్టర్ షహబాజ్ ఖాన్, గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

జూలపల్లి, ఆగస్టు 3 : మండలంలో నిర్వహించబోయే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ మండలపరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగిరి, ఆగస్టు 3: మండలంలో చేపట్టనున్న పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమంపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శైలజారాణి సమీక్ష నిర్వహించారు. స్పెషల్ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిష నర్ ఆకుల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు ఆర్పీలు, ఓటీలతో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శివప్ర సాద్, ఏఈ సతీష్, టీపీవో శ్రీహరి, టీపీఎస్ వినయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, మెప్మా ఏడీఎంసీ మౌనిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, రాజు, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, ఓటీలు, శానిటేషన్ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

సుల్తానాబాద్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, ఆశా వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీ మాట్లాడుతు ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. వాడల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని, పండ్ల మొక్కలను, పూల మొక్కలను నాటాలని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టరు శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మిరాజమల్లు

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పునఃప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పాలకుర్తి, ఆగస్టు 3: మండలంలోని బోడగుట్ట సమీపంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనుల అలసత్వంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌ను త్వరలో పనులు పూర్తిచేయాలని ఆదేశించడంతో సదరు గుత్తేదారు శనివారం నుంచి పనులు పునఃప్రారంభించారు.

కమాన్‌పూర్ గ్రామ కార్యదర్శిగా తిరుపతి

కమాన్‌పూర్, ఆగస్టు 3 : కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా ముల్కారి తిరుపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన లల్వాల మారుతి ధర్మారం మండలం వనపర్తికి బదిలీపై వెళ్లారు. గ్రామపంచాయతీ కార్యదర్శిగా తిరుపతిని నియమిస్తూ ఎంపీడీవో మునుగంటి సురేష్, ఎంపీవో కాటం భాస్కర్‌లు నియామక ఉత్తర్వులు అందజేశారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన

కమాన్‌పూర్, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శనివారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ టీచర్ మల్యాల భాగ్య తల్లిపాలను ప్రయోజనాలను వివరించారు.

పాలకుర్తి, ఆగస్టు 3: మండలం పరిధిలోని జయ్యారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధరి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పెంద్రు సాయిచరణ్, ఏఎన్ఎం నగునూరి సరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవులం శోభారాణి, జంగిలి రజిత,ఆశావర్కర్ అడ్డకొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపీవో

పాలకుర్తి,ఆగస్టు 3: మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతిగృహన్ని ఆదివారం ఎంపీవో సుధర్శన్ సందర్శించారు. వెంట పంచాయతీకార్యదర్శి పెద్రు సాయిచరణ్, కారోబార్ బద్దపురి శంకరయ్య ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ ఫీజు చెల్లించండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 3: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్‌సీ కోర్సులకు 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ ఫీజు ఈనెల 18వ తేదిలోగా చెల్లించాలని గోదావరిఖని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై.కిషన్ ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లమా, 10వతరగతిలో ఉత్తీర్ణులైన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. ఫీజును ఆన్‌లైన్, మీసేవా కేంద్రాలలో చెల్లించాలని, వివరాలకు స్టడీకేంద్రంలోని గానీ, సెల్‌నెంబర్ 7382929655లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై టీడీపీ సంబరాలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 3: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిగంటి దామోర్‌రెడ్డి, చిటికెల రాజలింగం, పెగడపల్లి రాజనర్సు, ఓదెలు, స్వరాజ్యం, వీరేందర్, స్వామి, రాజేశ్వరి, అశ్విని పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 3: ఆషాడ బోనాలను పురస్కరించుకుని శనివారం శాంతినికేతన్ హైస్కూల్‌లో బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థినిలు దేవతా రూపంలో, బాలురు పోతరాజుల వేషధారణలో స్థానిక చౌరస్తా వరకు బోనాలతో ఊరేగింపు వెళ్ళి బోనాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో కరస్పాడెంట్ పాపిరెడ్డి, ఉపాధ్యాయ బృందం రమాదేవి, సారయ్య, మీర్జాబేగ్, సత్యనారాయణ, సుజాత, ప్రశాంతి, సభాపతి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జూలపల్లి, ఆగస్టు 3 : మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మన్ అనే యువకుడు కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న లక్ష్మన్ బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డిని సంప్రదించగా ఆయన ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి 3 లక్షల రూపాయలు మంజూరిచేయించి ఎల్‌వోసీని బాధితునికి శనివారం అందజేశారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ


రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్, ఆగస్టు 3: సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులకు తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు సలహా మండలి సభ్యులు, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ శనివారం హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ హెల్త్‌కార్డుల ద్వారా న్యాయవాదుల కుటుంబ సభ్యులకు 2 లక్షల వరకు వైద్య సదుపాయం, న్యాయవాదికి 10లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీవీ రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, న్యాయవాదులు పెగడ శ్యాం సుందర్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, మల్యాల కరుణాకర్, ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

సుల్తానాబాద్ ఆగస్టు3: సుల్తానాబాద్ పట్టణంలోని పెరికే గిద్దె ఆంజనేయస్వామి ఆలయంలో నూతన విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. శనివారం ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్నదానాలు చేశారు. కరీంనగర్ మాజీ కార్పొరేటర్ సాదవేణి శ్రీనివాస్‌తో పాటు సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ బాలాజీ రావు, వికాస తరంగిణి చీఫ్ కో ఆర్డినేటర్ సాదుల సుగుణాకర్, సునిత స్వరూప, పొదిల్ల రమేష్ ,పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఆంజనేయస్వామి అభిషేక విగ్రహాన్ని గొట్టం మహేష్ సప్న దంపతులు కొనుగోలు చేసి ఆలయానికి వితరణ చేశారు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

పాలకుర్తి, ఆగస్టు 3: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. శనివారం మండలం పరిధిలోని గుడిపెల్లి, జయ్యారం గ్రామాల్లో మక్కాన్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మహిళ కుట్టు శిక్షణ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మనాలి మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, గుడిపెల్లి, జయ్యారం గ్రామాల గ్రామ శాఖల అధ్యక్షులు కొప్పు ప్రసాద్, భూషణవేని తిరుపతిగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పు హర్షణీయం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 3: చాలా ఏళ్ళుగా మాదిగ, మాదిగ ఉపకులాలు ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య అభిప్రాయపడ్డారు. పెద్దపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ న్యాయ స్థానం తీర్పును బీఎస్పీ స్వాగతిస్తుందన్నారు. అంబేద్కర్ కలలుగన్న సమాజం స్థాపనకు సుప్రీంతీర్పు ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాన్షీరాం కలలుగన్న దళిత జాతి అభివృద్ధికి ఈ తీర్పు దోహదపడుతుందన్నారు. వర్గీకరణ పోరాటంలో మందకృష్ణ మాదిగ ఎంతగానో శ్రమించారని కితాబునిచ్చారు. సుప్రీంతీర్పును అన్ని రాష్ట్రాలు త్వరితగతిన అమలు చేయాలని ఆయన కోరారు.

'సమాజ సేవ అభినందనీయం'


మారుతి దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని, ఆగస్టు 3: ప్రతిఫలం ఆశించకుండా 50 సంవత్సరాలుగా సామాజిక సేవ చేస్తున్న కొండేలా మారుతి సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక ఫ్రెండ్స్‌క్లబ్‌లో కొండేల మారుతి సేవల స్వర్ణోత్సవ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో లాభాపేక్ష లేకుండా మారుతి సామాజిక సేవలను అందిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో కొమురవెల్లి సత్యనారాయణ, మంథని గోపాలకృష్ణ, ఎండి షరీఫుద్దీన్, తాటి బుచ్చయ్య గౌడ్, వనమామలై అరుణదేవీ, సర్వ చిన్నబాపు, కొత్త శ్రీనివాస్ గుప్తాలు పాల్గొన్నారు.

అవయవదాన దినోత్సవం

రామగిరి, ఆగస్టు 3: జేఎన్టీయూ(మంథని) ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ అవయవదాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరణానంతరం మట్టిలో కలిసిపోయే అవయవాలను దానం చేసినట్లైయితే మరోకరికి పునర్జన నిచ్చేవారం అవుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు అవయవదానం చేసేందుకు ముందుకు రావాల్సిందిగా ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్టు అధికారి నూక రమేశ్ అవయవదానంపై అవగాహన కల్పించారు. అనంతరం అవయవదానానికి ముందుకు వచ్చిన కళాశాల సిబ్బందికి అభినందనలు తెలుపుతూ డోనర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశయా ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లింగమూర్తి, అధ్యక్షుడు అనంతరాములు, సభ్యులు ముత్యాల బాలయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ఉద్యోగుల అంగీకారం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 3: మరణానంతరం తమ అవయవాలను దానం చేసేందుకు పలువురు సింగరేణి యువ ఉద్యోగులు ముందుకు వచ్చారు. జాతీయ అవవయదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో యువ ఉద్యోగులకు అవగాహన కల్పించా రు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మాట్లాడారు. అవయవాల కొరతతో ప్రతి రోజు వేలాది మంది మరణించడం బాధాకరమైన విషయమని, అవయవ దానంతో అటువంటి వారికి మరణానంతం అవయవాలు మట్టిలో కలిసి వృధాగా పోకుండా మరొకరికి జీవితాన్ని అందిస్తాయని అన్నారు. అపోహలతో అనేక మంది అవయవ, నేత్ర దానాలకు ముందుకు రావడం లేదని, సంఖ్య పెరిగేలా యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం అవయవ, నేత్ర దానాలకు అంగీకారం తెలిపిన యువ ఉద్యోగులకు డోనర్ కార్డులను ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో వీటీసీ మేనేజర్ రంగారెడ్డి, ఎస్ఎంఎస్ ప్లాంట్ పీఓ నూక రమేష్, సూపర్ వైజర్లు, ట్రైనర్లు పాల్గొన్నారు.

'కుక్కలు, కోతుల బెడదను నివారించాలి'

అంతర్గాం, ఆగస్టు 3: కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుందనపల్లి, అక్బర్‌నగర్, మొఘల్ పహాడ్, బ్రహ్మణపల్లి, ఐటీసీ ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ స్వగృహలలో కుక్కలు, కోతుల బెడదతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి బెడద నివారణ చర్యలు తీసుకోవాలని కుందనపల్లి పంచాయతీ కార్యదర్శి నరహరి రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి మండలం వేంనూర్ నుంచి బదిలీపై వచ్చిన నరహరిని ఘనంగా సన్మానించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండల రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ చాంద్ పాషా, చంద్రయ్య, కొమ్ము ఐలమ్మ, మహంకాళి కర్ణమ్మ, సుంకరి రవీందర్, సలిగంటి రవి కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర కాలేజ్ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలో గల ఎస్సీ బాలుర కాలేజ్ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘా ల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లా ల ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ ఎస్సీ బాలుర కాలేజ్ హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉందని, భారీ వర్షాలు ఎప్పుడు కురిసినా అప్పుడు హాస్టల్ కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. అయినా అటువైపు జిల్లా అధికారులు ఎవరు కూడా కన్నెత్తి చూడడం లేదన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మొదుంపల్లి శ్రావణ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయకులు కుమ్మరి నవీన్, సిద్ధార్థ్ రాజు, రామ్ చరణ్, రోహిత్, నితిన్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థులతో కందుల సంధ్యారాణి, ఉపాధ్యాయులు

కోల్‌సిటీ, ఆగస్టు 3: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. శనివారం ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఇన్వెస్టర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకుని విద్యార్థులే తమ నాయకులను ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రుల అభీష్టానికి అనుగుణంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, ఉపాధ్యాయులు డీన్ రమేష్, సౌజన్య, ప్రశాంత్, రసజ్ఞ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 3 : మండలంలోని రాంపల్లికి చెందిన గడ్డం మల్లయ్యగౌడ్ ఇటీవల మృతిచెందగా శనివారం బిజేపి రాష్ట్ర యువ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. వెంట ఎల్లస్వామిగౌడ్, ఇల్లందుల శ్రీనివాస్, గడ్డం రాజయ్య, రామస్వామి, అనిల్, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సఖి కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 3 : సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అడ్మినిస్ట్రేటర్ స్వప్న అన్నారు. శనివారం మండలంలోని చీకురాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించగా సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, కౌన్సిలర్ సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వచర్ల ఎస్సీ కాలనీలో జ్వరాలు..

రామగిరి, ఆగస్టు 3: మండలంలోని కల్వచర్ల ఎస్సీ కాలనీ జ్వరంతో మంచం పట్టింది. ఎస్సీ కాలనీలో ఏ ఇంటికి వెళ్లినా జ్వరంతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కాలనీ పరిసరాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. దీనికి తోడు కాలనీలో పందుల సంచారంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీలోని ఒకే కుటుంబానికి చెందిన 8మంది జ్వరంతో బాధపడుతున్నారు. విపరీతంగా పెరిగిన దోమల కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక..


పతకాలు సాధించిన కనగర్తి విద్యార్థులు

ఓదెల, ఆగస్టు 3 : మండలానికి చెందిన పలువురు విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎన్‌టీపీసీ హైస్కూల్లో జిల్లాస్థాయి అథ్లెటిక్ క్రీడాపోటీలు నిర్వహించగా, కనగర్తి దాసరి పద్మ హనుమయ్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో జావెలిన్‌త్రోలో ఒల్లే అక్షయ్ కార్తి, కొలిపాక అక్షర, ముద్దమల్ల అజయ్, అండర్-16లో పెండెం అభినయశ్రీ, వేల్పుల అక్షయ, సైన్ల శివమణి, బంగారు పతకాలు సాధించారు. అలాగే ముద్దమల్ల అజయ్ కుమార్, దామరిషి చరణీ, రాయిల్లా చరణ్, పోటీలలో కాంస్య పతకాలను సాధించారు. వీరు ఈనెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక అయ్యారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శనివారం ఎంఈవో రాజయ్య, హెచ్ఎం రమేష్, పీఈటీ విష్ణు తదితరులు అభినందించారు.



పట్టాలు ఇప్పించాలని మంత్రికి వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 3: రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లె గ్రామస్థులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాజీ ఎంపీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావ్‌పల్లెలోని సింగరేణి స్థలాల్లో 40 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జీఓ నంబర్ 76 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో 80 మందికి మాత్రమే పట్టాలు జారీ చేశారని, గ్రామంలో 300కు పైగా ఇళ్ళకు పట్టాలు లేవని తెలిపారు. జీఓ నంబర్ 76 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇపింపచాలని బత్తిని శ్రీనివాస్ మంత్రిని కోరారు.

'పెన్షన్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 3: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరిగిన పెన్షన్‌తోపాటు ఎరియర్స్ బకాయిలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పలువురు అధికారుల బదిలీ

శ్రీరాంపూర్, ఆగస్టు 3 : సింగరేణిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీరాంపూర్ ఎస్టేట్స్ విభాగంలో పనిచేస్తున్న కె. స్వప్న మందమర్రికి, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో అదనపు సీఎంవో(స్పెషలిస్ట్)గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.ఉష కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి, ఈఎం విభాగం హైదరాబాద్‌లోని మార్కెటింగ్, మూవ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎస్.వి. రాజశేఖర్ ఎస్‌టీపీపీ జీఎంగా, మందమర్రి ఏరియా ఇంజనీర్‌గా పనిచేస్తున్న అదనపు జీఎం జె. నాగరాజు విజయవాడలోని ఆప్‌మెల్ ఎండీగా, ఈఅండ్ఎం విభాగం శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో డీజీఎంగా పని చేస్తున్న యాదయ్య ఏరియా ఇంజనీర్ అడ్రియాల ప్రాజెక్ట్‌కు, ఇందారం ఓసీపీలో పనిచేస్తున్న రమేష్ జీడీకె సీఈ(2, 2ఎ, 5)కి, ఆర్‌కె 5 గ్రూప్‌లో డీజీఎంగా పనిచేస్తున్న పి. అరుణ్ ప్రసాద్ భూపాలపల్లి కెటికె ఓసీ-3కి, ఆర్‌జి-2 ఏరియాలో డీజీఎంగా పనిచేస్తున్న క్రిష్ణప్రసాద్ ఇందారం ఓసీపీకి, శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో డీజీఎంగా పనిచేస్తున్న మల్లయ్య శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌కు, కెటికె-1 గ్రూప్ ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ భట్టాచార్య ఎఓ ఆర్‌కె-5 గ్రూప్ శ్రీరాంపూర్‌కు, శ్రీరాంపూర్ ఓసీపీ ఎస్ఈగా పనిచేస్తున్న కె. సారంగపాణి కెటికె-1 గ్రూప్ ఏవోగా, కెటికె-1 ఇంక్లైన్ డిప్యూటీ ఎస్ఈ ఆర్‌కె-5 ఇంక్లైన్‌కు, ఆర్‌కె-5 ఇంక్లైన్ ఈఈగా పనిచేస్తున్న నిఖిల్ ఆర్‌జి-2 ఓసీపీ-3కి, శ్రీరాంపూర్ ఓసీపీ ఈఈ అనిల్‌కుమార్ ఆర్‌జీ-3 ఓసీపీ-1కు, శ్రీరాంపూర్ ఓసీపీ ఈఈ సుభాష్ ఆర్‌జీ-3 ఓసీపీ-1కు బదిలీ అయ్యారు. సర్వే విభాగం కాసిపేట గనిలో డిప్యూటీ ఎస్ఎస్‌గా పనిచేస్తున్న జి. వెంకటేశ్వర్‌రావు మందమర్రి ఏరియా సర్వే అధికారిగా, ఫారెస్ట్ విభాగం శ్రీరాంపూర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్‌వి. రమణారెడ్డి కొత్తగూడెం, ఎల్లందు రీజియన్‌కు, ఎస్‌టిపిపిలో మేనేజర్‌గా పనిచేస్తున్న చంద్రమణి శ్రీరాంపూర్‌కు, ఫైనాన్స్‌అండ్‌ఆడిట్ విభాగంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి. భావన సీపీపీ కార్పొరేట్‌కు బదిలీ అయ్యారు. భూపాలపల్లిలో డీజీఎం(పర్సనల్)గా పనిచేస్తున్న ఆజ్మీరా తుకారం ఎస్‌టీపీపీ డీజీఎం(పర్సనల్)గా, శ్రీరాంపూర్ సూపర్‌బజార్ డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి. సదానందం ఆర్‌జి-3 పర్సనల్ విభాగానికి, ఎస్‌ఆర్‌పి-1లో డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న పాలకుర్తి రాజు శ్రీరాంపూర్ సూపర్‌బజార్‌కు, ఆర్‌కె 6 గనిలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె. సునీల్ కుమార్ ఎడ్యుకేషన్(కార్పొరేట్)కు, ఆర్‌జి-2 ఓసీపీ-3లో పనిచేస్తున్న ఎస్. సురేందర్ ఆర్‌కె 6 గనికి, భూపాలపల్లి కెటికె-1 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న ఎస్. సదన్ శ్రీరాంపూర్ ఎస్‌ఆర్‌పి-1కు, ఎక్స్‌ప్లోరేషన్ విభాగం శ్రీరాంపూర్ సూపరింటెండెంట్ జియాలజిస్టుగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్ ఆర్ అండ్ డి కార్పొరేట్‌కు బదిలీ అయ్యారు.